# మహిళల విద్య కోసం ఎనలేని కృషి

## సావిత్రీబాయి పూలే జయంతి వేడుకల్లో అధికారులు

సావిత్రీబాయి పూలే గొప్ప మానవతా వాది అని అధికారులు గుర్తుచేశారు. మహిళలపై అనేక కట్టుబాట్లు ఉన్న ఆ రోజుల్లోనే తాను చదువుకోవడంతోపాటు సాటి మహిళల విద్య కోసం ఆమె ఎనలేని కృషి చేశారని జ్ఞప్తికి తెచ్చారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా మహిళా అభ్యన్నతి కోసం ఆమె అహర్నిశలూ శ్రమించారని కీర్తించారు. తద్వారా ఎంతోమంది మహిళలను విద్యావంతులుగా తీర్చిదిద్దారని కొనియాడారు. ప్రముఖ సంఘ సంస్కర్త, మానవతావాది సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో అధికారులు, ఉపాధ్యాయులు శుక్రవారం అధికారికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సావిత్రీబాయి పూలే జీవితం నేటి యువతకు ఎంతో స్ఫూర్తిదాయకమవుతుందని పేర్కొన్నారు. – నమస్తే నెట్‌వర్క్

ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

న్యూవిజన్‌లో సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఉపాధ్యాయులు

ఖమ్మంరూరల్ : శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో..

బోనకల్లు : మహిళా ఉపాధ్యాయులకు సత్కారం

మధిర : కళాశాల అధ్యాపకులను సత్కరిస్తున్న దృశ్యం

కూసుమంచి : నేలకొండపల్లిలో..

సత్తుపల్లి టౌన్: సాయిస్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాలలో..

వేంసూరు: మహిళా ఉపాధ్యాయులకు సన్మానం

కొణిజర్ల: గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో..

తిరుమలాయపాలెం కస్తూర్బా బాలికల విద్యాలయంలో..

## సమస్యల సుడిలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు

### ఎస్‌జీపీటీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్

డైరీని ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

ఖమ్మం జనవరి 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా పెన్షనర్లు సమస్యల సుడిలో కొట్టుమిట్టాడుతున్నారని తెలంగాణ రాష్ట్ర పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు అర్విణీ రాజేంద్రప్రసాద్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం పెన్షనర్ల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు పరిశం పుల్లయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వానికి పలు దఫాలుగా సమస్యల గురించి వివరించినా పట్టించుకునే స్థితిలో లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం పెన్షనర్ల పట్ల వివక్ష ప్రదర్శిస్తుందన్నారు. డీఏలు, పీఆర్సీ విషయంలో సత్వర నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యలను వెంటనే పరిష్కరించకుంటే త్వరలో ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. అనంతరం నూతన క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో నర్సింహం, ఎంవీ నర్సింగరావు, యాదయ్య, రాయల రవికుమార్, కృష్ణమూర్తి, భాస్కరచారి, వెంకటేశ్వరరావు, రాధాకృష్ణమూర్తి, మేరి ఏసుపాదం, అంజలి, లక్ష్మి, సుజాత పాల్గొన్నారు.

## సంపూర్ణ ఆరోగ్య సేవలు అందించాలి: డీఎంహెచ్‌వో

భోజనాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో కళావతీబాయి

మధిర/ మధిర రూరల్, జనవరి 3: రోగులకు సంపూర్ణ ఆరోగ్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతీ బాయి వైద్యాధికారులకు సూచించారు. మధిర మండలంలో శుక్రవారం పర్యటించిన ఆమె.. తొలుత మహాదేవపురం పల్లె దవఖానను సందర్శించారు. అక్కడ రోగులకు అందుతున్న ఆరోగ్య సేవలను పరిశీలించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం అసంక్రమణ వ్యాధుల నివారణకు అవగాహన కల్పించే పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మహదేవపురం పల్లె దవఖానకు నిర్మాణానికి స్థలం దానమిచ్చేందుకు ముందుకొచ్చిన చేసిన స్వర్గీయ పుతుంబాక రామసీతమ్మ, పురుషోత్తం దంపతుల కుటుంబీకులను అభినందించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పృథ్వీరాజ్, ఎంఎల్‌హెచ్‌పీ ఐశ్వర్య తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన అద్దె వాహనాల డ్రైవర్లు

ఖమ్మం వ్యవసాయం, జనవరి 3 : నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ అద్దె వాహనాల ఓనర్ కం డ్రైవర్లు కలెక్టర్‌ను కలిశారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో సత్కరించారు.

## విద్యుత్ సమస్యలపై ఏడీఈకి వినతి

తిరుమలాయపాలెం, జనవరి 3: మండలంలోని బచ్చోడులో నెలకొన్న విద్యుత్ సమస్యలపై అఖిలపక్ష నాయకులు శుక్రవారం ఏడీఈకి వినతి పత్రం అందజేశారు. గ్రామంలో బచ్చోడు సెంటర్లో ఉన్న 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చాలని, ఎస్సీ కాలనీలో ఉన్న 11 కేవీ విద్యుత్ లైన్‌ను మార్చాలని కోరారు. నాయకులు తిమ్మిడి హనుమంతరావు, జక్కుల యాదగిరి, ఆమంచి దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

## అబాకస్‌లో హార్వెస్ట్ విద్యార్థుల ప్రతిభ

ఖమ్మం ఎడ్యుకేషన్, జనవరి 3 : యూనీయాస్ అబాకస్ అంతర్జాతీయ స్థాయి పోటీలో ఖమ్మం నగరంలోని హార్వెస్ట్ పాఠశాల విద్యార్థులు వివిధ క్యాటగిరిలో ప్రతిభ కనబర్చినట్లు కరస్పాండెంట్ పోపూరి రవిమారుత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలకు చెందిన నందన్‌రెడ్డి, ప్రతీక్‌లు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ ఆర్.పార్వతిరెడ్డి అభినందించారు. ఖమ్మంలోని నిర్మల్‌హృదయ్ పాఠశాల విద్యార్థి అస్మారుహి సీఎం ట్రోఫిలో పారా బ్యాడ్మింటన్‌లో సత్తా చాటినట్లు కరస్పాండెంట్ వంగా సాంబశివారెడ్డి తెలిపారు. విద్యార్థిని డైరెక్టర్ వి.సుధాకర్‌రెడ్డి, హెచ్‌ఎం వి.పద్మజ అభినందించారు.

## రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్ట్

ఖమ్మం ఎడ్యుకేషన్, జనవరి 3 : రాష్ట్రస్థాయి బయాలజీ టాలెంట్ టెస్ట్‌ను ఆన్‌లైన్ విధానంలో శుక్రవారం నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జిల్లా సైన్స్ మ్యూజియంలో అభినందించారు. కార్యక్రమంలో డీఎస్‌వో జగదీష్, స్టేట్ అధ్యక్షుడు పెసర ప్రభాకర్‌రెడ్డి, రేపాల శ్రీనివాసరావు, డాన్‌బాస్కో, రంజిత్ పాల్గొన్నారు. నగరంలోని శాంతినగర్ పాఠశాలలో శనివారం జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు కృపాబాలానందం తెలిపారు.

## ఇంగ్లిష్ భాష ప్రతిభా పోటీలు

ఖమ్మంఎడ్యుకేషన్, జనవరి 3 : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు శుక్రవారం ఈఎల్‌టీఏ ఆధ్వర్యంలో రిక్కాబజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఒలంపియాడ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు హెచ్‌ఎం శాంత, కన్వీనర్ శాంతారెడ్డి, కోకన్వీనర్ స్నేహలత మెమొంటోలు అందజేశారు.

## కేటీఆర్‌ను కలిసిన 'బొమ్మెర'

మధిర, జనవరి 3: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను బీఆర్ఎస్ నాయకుడు బొమ్మెర రామ్మూర్తి శుక్రవారం హైదరాబాద్‌లో తెలంగాణ భవన్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

## రోడ్డు భద్రతే భవిష్యత్తుకు పునాది : పీడీ దివ్య

మాట్లాడుతున్న పీడీ దివ్య

కూసుమంచి (నేలకొండపల్లి), డిసెంబర్ 3: రోడ్డు భద్రతే భవిష్యత్తుకు పునాది అని ప్రాజెక్టు డైరెక్టర్ (పీడీ) దివ్య అన్నారు. జాతీయ రహదారుల పనులు రేయింబవళ్లూ జరుగుతున్నాయని, ఇంకొంత వేగం పెంచి రాబోయే రెండేళ్లలో వీటిని పూర్తిచేస్తామన్నారు. ఖమ్మానికి అనుసంధానంగా ఉన్న నాలుగు జాతీయ రహదారుల పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని వివరించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా నేలకొండపల్లి మండలం పైనంపల్లి టోల్ ప్లాజా వద్ద శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జాతీయ రహదారుల్లో కోదాడ– ఖమ్మం రోడ్డు పూర్తయిందని, ఖమ్మం– దేవరపల్లి మరో నాలుగునెలల్లో పూర్తవుతాయని అన్నారు. నాగ్‌పూర్– అమరావతి, ఖమ్మం – విజయవాడ, మంచిర్యాల– వరంగల్, వరంగల్– ఖమ్మం రహదారులు ప్రారంభ దశలో ఉన్నాయని వివరించారు. వీటిని కూడా మరో రెండేళ్లలో పూర్తిచేసి అందుబాటులోకి తెస్తామన్నారు. అధికారులు కిరణ్, మోహన్‌సాయి, మునీష్‌కుమార్, కిరణ్‌సాయి పాల్గొన్నారు.

## పేకాటరాయుళ్లపై కేసు నమోదు

కారేపల్లి, జనవరి 3: పేకాట ఆడుతూ పట్టుబడిన ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎన్.రాజారాం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం మంగలితండా సమీపంలో గల చెరువు వద్ద పేకాట ఆడుతున్న పిల్లలమర్రి వెంకటేశ్, ధరావత్ చంటి, ధరావత్ గాంధీ, వాంకుడోత్ వీరన్నను అదుపులోకి తీసుకొని నాలుగు సెల్‌ఫోన్‌లు, నాలుగు బైక్‌లు, రూ.2020లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. బాబూరావు, బాలకృష్ణ పరారీలో ఉండగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు పేర్కొన్నారు.

## పంచాయతీ భవన నిర్మాణానికి స్థలం వితరణ

తిరుమలాయపాలెం, జనవరి 3: మండలంలోని మేకలతండాలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి గ్రామస్తులు బానోతు వీరు, పాండు, మంగు, పూర్ణచందర్, సూర్య, శారద, గుగులోత్ చిన్న కలిసి మూడు కుంటల స్థలాన్ని వితరణ చేశారు. ఈ స్థలం అగ్రిమెంటు పత్రాలను శుక్రవారం అధికారులకు అందజేశారు.

## మున్నేరు ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం : మంత్రి పొంగులేటి

అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి పొంగులేటి

మామిళ్లగూడెం, జనవరి 3 : ఖమ్మం, పాలేరు నియోజవకవర్గాల ప్రజలు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న మున్నేరు వాగు ముంపు సమస్యకు మరో ఏడు నెలల్లో శాశ్వత పరిష్కారం లభిస్తుందని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, శ్రీనివాసరెడ్డితో కలిసి వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్నేరు తీరం వెంబడి రూ.690 కోట్లతో 17 కిలోమీటర్ల ఆర్‌సీసీ రిటైనింగ్ వాల్ నిర్మిస్తున్నామని, జూలై నాటికి పనులు పూర్తి అవుతాయని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ 15 మీటర్ల ఎత్తు, 6మీటర్ల వెడల్పుతో రూరల్, అర్బన్ ప్రాంతాల్లో 8.5 కిలోమీటర్ల చొప్పున 17 కిలోమీటర్లు రిటైనింగ్ వాల్ నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, ఇరిగేషన్ ఎస్ఈ మంగళపుడి వెంకటేశ్వరరావు, ఆర్ఎండ్‌బీ ఎస్ఈ హేమలత, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, అర్బన్, రూరల్ తహసీల్దార్లు రవికుమార్, రాంప్రసాద్ పాల్గొన్నారు.

### డబుల్ బెడ్రూం ఇండ్ల పంపిణీకి చర్యలు

జిల్లాలో పూర్తిచేసిన డబుల్ బెడ్రూం ఇండ్లను సంక్రాంతిలోపు పంపిణీకి చర్యలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగిన అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ పాలేరు నియోజరవర్గ పరిధిలోని ఖమ్మంఅర్బన్ మండలం మల్లెమడుగులో ఉన్న 84, కూసుమంచి మండలం దుబ్బతండా 29, నేలకొండపల్లి మండలం ఆచర్లగూడెం–18 మొత్తం 131 ఇండ్లకు లబ్ధిదారులను ఎంపిక చేసి పంపిణీకి ఏర్పాట్లు చేయాలన్నారు.

### రూరల్ మండలంలో మంత్రి పర్యటన

ఖమ్మంరూరల్, జనవరి 3: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరి చేస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డితో కలిసి ఖమ్మం రూరల్ మండలంలో శుక్రవారం పర్యటించిన మంత్రి పొంగులేటి.. ఎం.వెంకటయపాలెం, గోళ్లపాడు, కాచిరాజుగూడెం, చింతపల్లి, ఆరెకోడు తండా గ్రామాల్లో నిర్మించనున్న సీసీ, బీటీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు.

## అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి

### అదనపు కలెక్టర్ పి.శ్రీజ

అధికారులతో సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

మామిళ్లగూడెం, జనవరి 3 : ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పనులు, నరేగ, పీఎం శ్రీ హాస్టల్‌లో సదుపాయాలు తదితర వాటిపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని పీఎం శ్రీ పథకంలో ఎంపికైన పాఠశాలలో నిర్దేశించిన అభివృద్ధి పనులను పక్కాగా నిర్వహించాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా జిల్లాలోని పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులు, వాటి స్థితిగతులు, బిల్లుల చెల్లింపుపై మండలాల వారిగా సమీక్షించి పనులు పూర్తి అయిన వాటికి వెంటనే బిల్లులు చెల్లింపు ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. సమావేశంలో జడ్పీ సీఈవో దీక్షా రైనా, డీఈవో సోమశేఖరశర్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## డీసీసీబీలో డీఎల్ టీసీ సమావేశం

ఖమ్మం వ్యవసాయం, జనవరి 3 : జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌పై శుక్రవారం డిస్ట్రిక్ లెవల్ టెక్నికల్ కమిటీ(డీఎల్‌టీసీ) సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా అదనపు కలెక్టర్ పీ శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. తొలిసారి డీసీసీబీకి వచ్చిన అడిషనల్ కలెక్టర్‌ను డీసీసీబీ సీఈవో వెంకట్ ఆదిత్యతో కలిసి చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు సత్కరించారు. అనంతరం ఆయా బ్యాంకుల ముఖ్య అధికారులు, వ్యవసాయ,అనుబంధరంగాల అధికారులతో సమీక్షా చేశారు. గడిచిన వానకాలం సీజన్‌లో రైతులకు అందించిన పంట రుణాలు, రాబోయే వానాకాలం పంట రుణాలపై చర్చించారు. కార్యక్రమంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల వ్యవసాయ, ఉద్యాన, మత్స్య, పశుసంవర్ధక శాఖ అధికారులు, డీసీసీబీ కార్యాలయం ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

## రైలులో చైన్ చోరీకి యత్నం

మధిర, జనవరి 3: రైలు ప్రయాణికురాలి మహిళ మెడలో నుంచి బంగారు గొలుసును దొంగిలించేందుకు ఓ దండగుడు ప్రయత్నించి పరారైన ఘటన మధిర రైల్వేస్టేషన్‌లో గురువారం రాత్రి చోటు చేసుకుంది. మధిర యాదవబజార్‌కు చెందిన రమణ తన భర్తతో కలిసి ఖమ్మం ఆసుపత్రికి వెళ్లి శాతవాహన ఎక్స్‌ప్రెస్ ద్వారా మధిర రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. ఓ గుర్తుతెలియని దుండగుడు రైల్వేస్టేషన్‌లో శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైలు దిగుతున్న క్రమంలో ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును తెంచుకొని పారిపోబోయాడు. ఆ సమయంలో ఆ మహిళ తన గొలుసును గట్టిగా పట్టుకోవడంతో దొంగ బలవంతంగా లాగాడు. దీంతో కొంత బంగారం దొంగ చేతికి చిక్కింది. దీంతో సదరు మహిళ కేకలు వేయడంతో అక్కడి నుంచి దొంగ పారిపోయాడు. మహిళ మెడకు తీవ్రగాయలయ్యాయి. బాధితురాలు రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు.

## ఎస్‌టీ బాలికల హాస్టల్ తనిఖీ

మధిరలోని ఎస్‌టీ బాలికల హాస్టల్‌ను డీఎంహెచ్‌వో కళావతీబాయి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల కోసం తయారు చేసిన భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థినులకు అందిస్తున్న వసతులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం బాలికలకు స్వయంగా ఆరోగ్య పరీక్షలు చేశారు. విద్యార్థినులు ఆరోగ్యంపట్ల శ్రద్ధ చూపాలని, పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యవంతంగా ఉండాలని సూచించారు. హెచ్‌ఎస్ సుబ్బులక్ష్మి, హెచ్‌ఈవో గోవిందు, ఏఎన్‌ఎం వీ.విజయకుమారి, జే.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

## వయోజన విద్య డీడీగా అనిల్

ఖమ్మం ఎడ్యుకేషన్, జనవరి 3 : వయోజన విద్య డీడీగా అనిల్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ వయోజన విద్య డైరెక్టర్ ఉషారాణి ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశం అనంతరం డైరెక్టర్ నుంచి డీడీగా అనిల్ ఉత్తర్వుల కాపీని అందుకున్నారు. తొలుత ఆదిలాబాద్‌లో పనిచేస్తున్న డీడీకి అదనపు బాధ్యతలు అప్పగించినప్పటికీ దూరభారం కావడంతో విధుల్లో చేరేందుకు విముఖత చూపారు. దీంతో వయోజన విద్యలో ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న అనిల్‌కు ఎఫ్ఏసీ ఇచ్చారు.

## సైబర్ నేరాలపై అవగాహన

ఖమ్మం ఎడ్యుకేషన్, జనవరి 3 : ఖమ్మం నగరంలోని బేబీమూన్ పాఠశాలలో సైబర్ నేరాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. సైబర్ క్రైమ్ విభాగం ఎస్సై విజయ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, సంబంధం లేని మేసేజ్‌ల లింక్స్ ఒపెన్ చేయవద్దని, ఓటీపీ నెంబర్‌లు ఇతరులకు చెప్పవద్దని సూచించారు. సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కేసా వీరన్న, డైరెక్టర్ కేసా భాస్కర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ రూల్స్ పాటిద్దాం

పెనుబల్లి, జనవరి 3: ట్రాఫిక్ రూల్స్ పాటించి ప్రమాదాలను నివారిద్దామని ఎంవీఐ రాజశేఖర్ పిలుపునిచ్చారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా మండలంలోని ముత్తగూడెం వద్ద ఉన్న తెలంగాణ సరిహద్దు ఆర్‌టీఏ చెక్‌పోస్టులో శుక్రవారం డ్రైవర్లకు అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలను విధిగా పాటించి క్షేమంగా ఇల్లు చేరాలన్నారు. వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించొద్దన్నారు. కార్యక్రమంలో చెక్‌పోస్టు సిబ్బంది పాల్గొన్నారు.

## కోడిపందేలు ఆడుతున్న వారిపై కేసు

సత్తుపల్లిటౌన్, జనవరి 3: మండలంలోని సత్యనారాయణపురం గ్రామశివారు పామాయిల్‌తోటలో ఈ నెల 1న కోడిపందాలు నిర్వహించారన్న సమాచారం మేరకు గంగారం గ్రామానికి చెందిన బండారు మారేశ్‌నారాయణ, వెంకటనారాయణ, తుంబూరి గ్రామానికి చెందిన భరత్, పామాయిల్ తోట యజమాని వెంకట్రామిరెడ్డితో పాటు, మరికొంతమందిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు సత్తుపల్లి సీఐ టీ.కిరణ్ తెలిపారు. పేకాట, కోడిపందేలు ఆడుతున్న వారి సమాచారాన్ని సత్తుపల్లి సీఐ ఫోన్‌నెంబర్ 8712659167, సత్తుపల్లి పోలీస్‌స్టేషన్ నెంబర్ 8712659168, ఎస్సై 8712659169 నెంబర్లకు తెలపాలని సూచించారు.

## ఇన్‌చార్జి ఎంపీడీవోగా రంజిత్‌కుమార్

వేంసూరు, జనవరి 3: వేంసూరు ఇన్‌చార్జి ఎంపీడీవోగా రంజిత్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఎంపీడీవో రమాదేవి బదిలీపై వెళ్లగా సత్తుపల్లి ఎంపీడీవో సీహెచ్.నాగేశ్వరరావు వేంసూరు ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఆయన అనారోగ్య కారణంగా కలెక్టర్‌కు తనకు ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తప్పించాలని కోరారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వేంసూరు ఎంపీవోగా విధులు నిర్వహిస్తున్న రంజిత్‌కుమార్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పజెప్పినట్లు ఆయన తెలిపారు.

## విద్యార్థులకు బెల్టులు, టైలు పంపిణీ

వైరారూరల్, జనవరి 3: 'పర్పుల్ డీఎన్ఏ సొసైటీ' ఆధ్వర్యంలో మండలంలోని గొల్లెనపాడు ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు సొసైటీ కో ఆర్డినేటర్ పెనుగొండ ఉపేందర్‌రావు శుక్రవారం అందజేశారు. హెచ్‌ఎం పీ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపేందర్‌రావు మాట్లాడుతూ పాఠశాలలో పనిచేస్తున్న బండారు సరిత అభ్యర్థన మేరకు వీటిని అందజేశామన్నారు. కార్యక్రమంలో సొసైటీ బాధ్యులు చౌదవరపు బద్రీనాథ్, కవితరాణి, మిట్టపల్లి భాస్కర్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ రాములమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

## దుప్పట్లు పంపిణీ

వైరాటౌన్, జనవరి 3: గ్రేట్ విజన్ క్లబ్ అధ్యక్షులు లయన్ తోటకూర శ్రీకాంత్ ఆధ్వర్యంలో వైరాలోని మాటూరుపేటకు వృద్ధులకు ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ డాక్టర్ బాలయ్య సహకారంతో క్లబ్ సభ్యులు శుక్రవారం దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీజీఎస్‌టీ కోఆర్డినేటర్ వుండ్రు శ్యామ్‌బాబు, ప్రెసిడెంట్ తోటకూర శ్రీకాంత్, ట్రెజరర్ వుయ్యూరు రామకృష్ణ, చిన్నా పాల్గొన్నారు.

## న్యూలిటిల్ ఫ్లవర్ విద్యార్థులకు పతకాలు

వైరాటౌన్, జనవరి 3: కరీంనగర్‌లో గంగోత్రి ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలోజరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో వైరాకు చెందిన న్యూలిటిల్ ఫ్లవర్ విద్యార్థులు బంగారు, వెండి పతకాలు సాధించారు. బీ.మహేశ్వరి, ఎం.మీనాక్షి (గోల్డ్‌మెడల్), సీహెచ్.కౌశిక్, కె.జశ్వంత్, ఎం.ఆరాధ్య, కె.జేసుసలైశ (సిల్వర్ మెడల్) పతకాలు సాధించారు. వీరిని కరస్పాండెంట్ డాక్టర్ పీ.భూమేశ్‌రావు, డైరెక్టర్ సుమన్, ప్రిన్సినాల్ షాజీమ్యాథ్యూ, ఏవో నర్సింహారావు, యోగా గురువు రజిని, తోటి విద్యార్థులు అభినందించారు.

## డివైడర్‌ను తొలగించిన ప్రైవేటు వ్యక్తులు

వైరాటౌన్, జనవరి 3: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా నేషనల్ హైవే రోడ్డుకు రెండోవైపు ఓ ప్రైవేటు వ్యక్తి ఇల్లు నిర్మించుకునేందుకు అనుమతులు తీసుకొని వాణిజ్య భవనాన్ని నిర్మించాడు. ఈ భవనం కింది భాగంలో ఒక టీస్టాల్‌తో పాటు ఇతర వ్యాపారాలను ఏర్పాటు చేశారు. అక్కడికి వచ్చే వారికి రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్ అడ్డుగా ఉందని బుధవారం డివైడర్‌ను తొలగించారు. గురువారం వరకు సంబంధిత అధికారులు కనీస చర్యలు తీసుకున్న నాధుడే కరువయ్యారు. అధికార పలుకుబడి అండదండలుంటే ప్రభుత్వ ఆస్తులను కొల్లగిట్టినా ధ్వంసం చేసినా అడిగే నాధుడు కానీ చర్యలు తీసుకునే వారు కానీ కరువయ్యారనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

## చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

కారేపల్లి, జనవరి 3: మ